క్లుప్తంగా

సాహిత్యం సర్వ కళలకూ ఆధారం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీటీఆర్ఐ: సాహిత్యం సర్వ కళలకు ఆధారమని అని ప్రముఖ వక్త, ఘంటసాల పాటల గాయకుడు దుర్భ శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో జరిగిన సాహితీ గోదావరి ఉగాది కవితా సంచికను ఆవిష్కరించి అనంతరం ఆయన ప్రసంగించారు. సాహిత్యం కేవలం ఆనందం కోసం కాకుండా సమాజం కోసం అనే ఉద్దేశంతో రచయితలు చైతన్యవంతమైన రచనలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సాహితీ గోదావరి అధ్యక్షుడు డాక్టర్ ర్యాలి శ్రీనివాసు మాట్లాడుతూ ఇప్పటివరకు సాహితీ గోదావరి నాలుగు ఉగాది సంచికలు వెలువరించిందని తెలియజేశారు. ఇదే సమావేశంలో ఓ కలం జ్ఞాపకం సంచిక, మధుర వచనం కవితా సంపుటి నీ అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 20 మంది కవులు కవిత గానం చేశారు. కవులను సాహితీ గోదావరి అధ్యక్షుడు డాక్టర్ ర్యాలి శ్రీనివాసు ఆధ్వర్యంలో సత్కరించారు. తాళ్లపూడి రెవెన్యూ ఏఎస్ఓ జోదాల వెంకటేశ్వరరావు, కామేశ్వరరావు, వేమూరి రాధారాణి పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు



అంబేడ్కర్ జయంతి ఉత్సవాలలో యూత్ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆల్కాట్‌తోట 18వ డివిజన్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాలు ఆదివారం ఐ.ఎల్.టి.డి. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఉత్సవాలు ప్రారంభించారు. డప్పుల గారడీలతో సాంస్కృతిక నృత్యాలతో తీన్మార్ డప్పులతో అంబేడ్కర్ పాటలతో కోలాహలంగా సాగింది. ఐ.ఎల్.టి.డి. సెంటర్ లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి టుటౌన్ ఇన్‌స్పెక్టర్ శివగణేష్, ఎస్సై శ్యాంసుందర్ పూలమాలలు వేశారు. చిన్నారుల నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అంబేడ్కర్ యూత్ సభ్యులు కొండపల్లి సూరిబాబు, అంగర వంశీ, నిల్లి సుధీర్, గెడ్డం శేఖర్, రాజేష్, సంజయ్, కుషిలు, మాదా శ్యామలరావు, కప్పల ప్రవీణ్, కప్పల శేఖర్, కొత్తపల్లి బ్రదర్స్, మంద బాలరాజు, నిల్లి సుబ్బారావు, మీసాల నవీన్, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రకాశం నగర్ : మున్సిపల్ కాలనీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్ 16వ సీజన్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం స్థానిక మున్సిపల్ కాలనీ క్రికెట్ క్రీడా మైదానంలో ఉత్సాహంగా ముగిసింది. పది రోజులుగా జరిగిన ఈ టోర్నమెంట్లో 9 జట్లు పాల్గొనగా విన్నర్స్‌గా ఫార్మా కింగ్స్, రన్నర్స్‌గా చిన్న జగ్గర్స్ నిలిచాయి. విజేతలకు మదర్ హాస్పిటల్ అధినేత ఉషా కిరణ్ సౌజన్యంతో ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టి.కే. విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం ప్రజలు ఎంతమంది ప్రజా నాయకుల్ని ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా చట్టసభలకు ఎన్నుకొని పంపినా ఇప్పటివరకు స్టేడియం రాకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. రఫీ, వజ్రనాథ్, ఉమా, కోట పాల్గొన్నారు.

కడియపులంక నర్సరీలతో రాష్ట్రానికి కీర్తి



మంత్రి నిమ్మల రామానాయుడిని సత్కరిస్తున్న పుల్లా వీర వెంకట్రావు

యలమంచిలి: దేశంలో రాష్ట్ర కీర్తిని ఘనంగా చాటుతున్న ఘనత కడియపులంక నర్సరీ రైతులదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు ఆదివారం నిర్వహించిన లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ డిస్టిక్ 316 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలోని కడియపులంక నర్సరీలకు దేశ విదేశాలలో అత్యంత ప్రాధాన్యం రావడంలో రైతుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడుకి శ్రీ సత్య దేవా నర్సరీ అధినేత, మాజీ ఐఎసీఏ ప్రధాన కార్యదర్శి పుల్లా వీర వెంకట్రావు, నర్సరీ రైతులు శాలువా కప్పి పుష్ప గుచ్ఛం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో నర్సరీ రైతులు పుల్లా ఆంజనేయులు, పుల్లా పెద్ద సత్యనారాయణ, పుల్లా సంఘ సత్యనారాయణ, పుల్లా వీర్రాజు, పుల్లా రాజశేఖర్ ,నక్క అమ్మిరాజు, కర్రే ఎస్సై, పుల్లా శ్రీకాంత్, పేమ్మనబోయిన పెదకాపు, కొండేపూడి నాగు, వజ్రపు కోటేశ్వర రావు (లయన్స్ గవర్నర్) పాల్గొన్నారు.

ఆహ్లాదం కరవు.. నిర్లక్ష్యం దరువు

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా సంజీవయ్య పార్క్
- ఎప్పుడు తెరుచుకుంటుందో తెలియని పరిస్థితి
- చుట్టూ పేరుకుపోయిన వ్యర్థాలు
- విచ్చలవిడిగా సంచరిస్తున్న విష కీటకాలు



తాళం వేసి ఉన్న పార్కు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో తెరచి అందుబాటులో ఉంచాల్సిన సంజీవయ్య పార్కు ఎప్పుడూ మూసి వేసి ఉండటంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కు ఏ రోజు తెరచి ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొందని, అధికారులు స్పందించి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాజమహేంద్రవరం 42వ డివిజన్ మున్సిపల్ కాలనీలో గల సంజీవయ్య పార్క్‌లో సరైన అభివృద్ధి లేకపోవడంతో స్థానికులకు అందుబాటులో లేకుండా పోయింది. వసతులు ఉన్నప్పటికీ నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావడంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యవైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. సంజీవయ్య పార్కు ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టం వచ్చిన సమయంలో పార్కును తెరుస్తున్నారు. ఏ సమయంలో పార్కుకు వెళ్లాలో తెలియని పరిస్థితి ఉందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో పార్కు నిరుపయోగంగా ఉంది. పార్కు చుట్టూ చెత్తాచెదారాలు పెరిగిపోవడంతో విష కీటకాలు విపరీతంగా సంచరిస్తున్నాయి. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే చాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఈ పార్కు మారిపోతోంది. అధికారులు దృష్టి సారించి పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఆహ్లాదంగా గడిపే విధంగా సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నగరపాలక సంస్థ వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలని దీనివల్ల పార్కు లో ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా ఉంటుందని స్థానికులు అభిప్రాయం పడుతున్నారు. అవసరమైతే తాము వాచ్‌మన్‌కు జీతాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు స్థానికులు ప్రకటించారు.

అభివృద్ధి చేయండి



మున్సిపల్ కాలనీలో ఉన్న సంజీవయ్య పార్క్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వృద్ధులు మహిళలు, చిన్నారులు ఆహ్లాదంగా గడిపేందుకు సిద్ధం చేయాలి. అసాంఘిక కార్యకలాపాలు నిరోధించేందుకు వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలి. స్థానికులంతా కలిసి అతనికి జీతం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– మొహిద్దీన్, మున్సిపల్ కాలనీ

ఇబ్బందిగా ఉంది



మహిళలు చిన్నారులతో కలిసి వెళ్లడానికి పూర్తిస్థాయి అవకాశం లేకుండా పోయింది . పార్కు చుట్టూ వ్యర్థాలు పేరుకుపోవడంతో విషకీటకాలు విపరీతంగా సంచరిస్తున్నాయి. పరిస్థితి చుట్టుపక్కల నివసిస్తున్న వారికి ప్రమాదకరంగా తయారైంది. పార్కును అందరికి అందుబాటులోకి తీసుకుని రావాలి.

– లక్ష్మి, గృహిణి, మున్సిపల్ కాలనీ

కొనసాగుతున్న సీహెచ్‌ఓల నిరవధిక సమ్మె

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద ఏపీమిడ్‌లెవెల్ హెల్త్‌ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పి)/కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సీహెచ్‌వోల చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం ఏడవ రోజుకు చేరుకుంది. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మమత మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ సీహెచ్‌వోలపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీహెచ్‌ఓలుగా పేదలకు సేవచేస్తున్న తమపై చులకన భావంతో మంత్రి మాట్లాడటం దారుణమన్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.. అధిక సంఖ్యలో సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంకలో జాతీయ రహదారి పక్కనేగల శ్రీ గంగమ్మతల్లి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు నిర్ణయించినట్లు ఆలయ భక్తబృందం తెలిసింది. ఈ మేరకు ఈ నెల 8వ తేదీ ఉదయం 6.54 గంటలకు శంకుస్థాపన జరుగుతుందన్నారు. హైవేపై గల అభయాంజనేయ స్వామివారి ఆలయం పక్కనే నిర్మితమవుతున్న ఈ ఆలయాన్ని దాతలు, భక్తుల సహకారంతో నిర్మించనున్నారు.

రుషుల ఆదర్శమే మోక్షానికి మార్గం



సర్టిఫికెట్లు అందుకున్న పిల్లలు

సీటీఆర్ఐ: 'ఋషుల ఆదర్శమే మోక్షానికి మార్గం' అని బ్రహ్మ ధ్యాన సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అరవ మణికంఠ అన్నారు. స్థానిక బ్రహ్మ ధ్యాన సత్సంగ్ సంస్థలో మూడు రోజులుగా పిల్లలకు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సమ్మర్ క్యాంప్ ఆదివారంతో ముగిసింది. ఈ క్యాంప్‌లో 40 మంది పాల్గొన్నారు. శారీరిక, మానసిక, ఆధ్యాత్మిక శుద్ధి మార్గం గురించి తెలుసుకున్నారు. ప్రతి రోజు ధ్యానం, జపం, ధర్మ చర్చలు, ఋషుల జీవితాలపై సత్సంగ్, పక్షులకు నీళ్లు, జీవ రక్షణ సేవ, చిన్నారులకు ధర్మ కథలు, నైతిక అభివృద్ధి వంటి అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిలో మన శ్శాంతి, నియమబద్ధత, భక్తి, ఆత్మ విచారణ వంటి గుణాల పెంపు కనిపించిందని బ్రహ్మ ధ్యాన సత్సంగ్ సంస్థ రాజమహేంద్రవరం జిల్లా రూరల్ అధ్యక్షుడు యనమదల సాయి అన్నారు. క్యాంప్ ముగింపు సందర్భంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధర్మ గ్రంథాలు, పౌష్టిక ఆహారం, సర్టిఫికెట్ అందజేశామని వివేక వర్ధిని అధ్యక్షురాలు అరవ దేవి అన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివ, సత్యనారాయణ, దేవి, సాయి, లోవరాజు, మానస, రాజేశ్వరి, మహేష్ పాల్గొన్నారు.

నదీ జలాలను పరిరక్షించుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు
- స్వచ్ఛ గోదావరి కార్యక్రమాన్ని చేపట్టిన స్విమ్మర్స్ క్లబ్



గోదావరిలో వ్యర్థాల తొలగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సూర్య ప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి నదిలో రోజు రోజుకి కలుషితమవుతున్న నదీజలాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ది గోదావరి స్విమ్మర్స్ క్లబ్ శాశ్వత గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు అన్నారు. ఆదివారం గోదావరి స్విమ్మర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పుష్కర ఘాట్‌లో స్వచ్ఛ గోదావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బాధ్యత వహించి గోదావరి నదిని కాలుష్యం బారి నుంచి కాపాడుకోవాలన్నారు. గోదావరి స్విమ్మర్స్ క్లబ్ ఈ విషయంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నదీ జలాలను కాపాడుకోకపోతే భవిష్యత్ తరాలు చాలా నష్టపోతాయని, అందుకే ప్రకృతి ప్రసాదించిన నదులను కాపాడుకోవాలని రౌతు సూచించారు. శ్వాశ్వత స్టీరింగ్ కమిటీ మెంబర్ నందం లక్ష్మణమూర్తి, మాదాల వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు గుబ్బల వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ కమాండర్ సూరెడ్డి కృష్ణకుమార్, సెక్రటరీ పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

పురస్కారం నా బాధ్యతను పెంచింది

సుబ్రహ్మణ్యం



పురస్కారాన్ని అందుకుంటున్న సుబ్రహ్మణ్యం

సీటీఆర్ఐ: ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకోవడం తన బాధ్యతను మరింత పెంచిందని రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఎంవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. విజయవాడలో పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పద్మ శ్రీ ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా విభిన్న రంగాలలో విశిష్ట సేవలు అందించిన ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులకు ఎన్టీఆర్ కీర్తి పురస్కారాలను ముఖ్య అతిథిగా విచ్చేసిన అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అందించారు. రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఎం.వి.ఆర్.సుబ్రహ్మణ్యం పురస్కారాన్ని అందుకున్నారు. నిడిగట్ల ఎం.పి.యు.పీ స్కూల్ లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన ఆదివారం ఆయన నివాసం వద్ద పురస్కార ప్రదానం గురించి వివరించారు. గత మూడు దశాబ్దాలుగా విద్యార్థుల ఉన్నతికి చేసిన కృషికి, బలహీన వర్గాలకు చేస్తున్న సామాజిక సేవల్ని గుర్తించి ఈ పురస్కారానికి పాన్ ఇండియన్ అధ్యక్షుడు అద్దంకి రాజా యోనా ఎంపిక చేశారని సుబ్రహ్మణ్యం చెప్పారు. సొంత ఖర్చులతో విద్యార్థులను ఇస్రో పర్యటన, విహార యాత్రలకు తీసుకు వెళ్లడం, కుల వృత్తులపై అవగాహన పెంచడం, నర్సరీలను సందర్శించి పర్యావరణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించానని సుబ్రహ్మణ్యం తెలిపారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



సతీష్‌శర్మను సత్కరిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలోని బ్రాహ్మణులను ప్రభుత్వం గుర్తించేలా చేసి వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ అన్నారు. రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సతీష్ శర్మకు రాజమహేంద్రవరం నగర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పుట్రేవు సూర్య వెంకటరావు సారథ్యంలో ఆదివారం కుమారి థియేటర్ ఎదురుగా ఉన్న జూపూడి ఫంక్షన్ హాలులో సత్కారం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని బ్రాహ్మణ యువత, విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి, నైపుణ్యాలు పెంచి యువతీ యువకులకు సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బ్రాహ్మణ మహిళల సాధికారత, స్వావలంబనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సతీష్ శర్మ చెప్పారు. సమాఖ్యలో 1,000 మంది సభ్యులను చేర్పించి సభ్యత్వ రుసుమును కార్పస్ ఫండ్‌గా ఏర్పాటు చేసి విద్యార్థులకు, వృద్ధ మహిళలకు సహాయం చేసే కార్యక్రమాలు చేపడతామన్నారు. కంచికామకోటి పీఠాధిపతిని అన్నవరం నుంచి అందించిన తూర్పుగోదావరి ఎంతో పుణ్య ప్రదమైనదని ఆయన అన్నారు. సమాఖ్య కార్యదర్శి కొత్తపల్లి శ్రీదేవి మాట్లాడుతూ బ్రాహ్మణ మహిళల ఉన్నత విద్యతో డాక్టర్, ఇంజినీర్లు ఇతర ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మహిళలు ఐక్యంగా ముందుకు వెళ్లాలని, సమాఖ్య సభ్యులుగా చేరాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బ్రాహ్మణ గర్జన నిర్వహించాలని శ్రీదేవి కోరారు. ఈ కార్యక్రమంలో సత్యవాడ దుర్గాప్రసాద్, కోశాధికారి పులిపాక ప్రసాద్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ప్రతిరూపం భగీరథుడు

కలెక్టర్ పి ప్రశాంతి



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): భగీరథుని జీవితం నుంచి మనం స్ఫూర్తి పొందాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివి నుంచి భువికి గంగను తీసుకుని రావాలన్న భగీరథుని లక్ష్యం, చిత్తశుద్ధి, కఠోర సాధన ద్వారానే సాధ్యం అయిందని చెప్పారు. భగీరథుని జీవితం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలన్న ఉద్దేశంతో ఆయన జయంతి వేడుకలను జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. గంగను దివి నుంచి భువికి తీసుకు రావాలన్న లక్ష్యాన్ని చిన్నతనంలోనే నిర్దేశించుకొని నిరుత్సాహ పడకుండా ప్రయత్నించి సఫలీకృతం అయ్యారన్నారు. సగం నీళ్లు ఉన్న గ్లాసును చూసి 'సగం నీళ్ళు మాత్రమే ఉన్నాయని' ప్రతికూల స్వభావం కలిగి ఉన్న వ్యక్తులు భావిస్తే, సానుకూల స్వభావం కలవారు 'గ్లాసు ఖాళీగా ఉండకుండా సగం నిండి ఉంది' అని ఆశావహ దృక్పథం కలిగి ఉంటారని చెప్పారు. ఎప్పుడు సానుకూల ఆలోచనా ధోరణి కలిగి ఉంటామో, అప్పుడు అనుకూల ఫలితాలు సాధ్యం అవుతాయని పేర్కొన్నారు. బృహత్తర లక్ష్యాలను సాధించిన వారి నుంచి ప్రేరణ పొందాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సానుకూల వైఖరి అవసరమని, తద్వారా మెరుగైన ఫలితాలు సాధించడం సాధ్యం అవుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎస్. జ్యోతి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జోరున వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం



భారీ వర్షానికి జలమయమైన నగరంలోని రామచంద్రరావుపేట



జలమయమైన బొమ్మూరు బాలాజీపేటరోడ్డు



ఆదెమ్మదిబ్బ ప్రాంతం ఇలా..

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో ఆదివారం ఉదయం ఒక్కసారిగా భారీవర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు అన్నీ జలమయమయ్యాయి. కొద్దిరోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు వర్షం రాకతో కొంత ఉపశమనం పొందారు. చిరు వ్యాపారులు మాత్రం వర్షం వలన వ్యాపారాలు లేక ఇబ్బందులు పడ్డారు. వర్షం రాకతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రాజమహేంద్రవరం నగరంలోనూ ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో జనం రాకపోకలకు అవస్థలు పడ్డారు.

విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణ తరగతుల్లో తయారు చేసిన హ్యాండీక్రాఫ్టలతో విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, యోగా హ్యాండ్ క్రాఫ్ట్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కోళ్ళ అచ్యుత రామారావు, ఆదిరెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు.

అలరించిన కవులు, గాయకుల సమ్మేళనం



కవులను సత్కరించిన దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: అంబేడ్కరీయం పేరిట కవులు, గాయకుల సమ్మేళనం ఏర్పాటు చేసి ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన అంబేడ్కర్ సేవా కేంద్రం చరిత్రలో నిలుస్తుందని రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ పాడి రామారావు ప్రశంసించారు. ఆదివారం స్థానిక మోడల్ కాలనీలోని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన కవులు, గాయకుల సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సేవా కేంద్రం చేస్తున్న సేవలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలు నూతన ఒరవడిని సృష్టిస్తున్నాయన్నారు. ప్రముఖ కవి డాక్టర్ గూటం స్వామి సభా నిర్వాహకులుగా వ్యవహరించారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 100 మంది కవులు, గాయకులు పాల్గొని తమ కవితలతోనూ, గానంతోనూ అలరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కవులు, గాయకులను సన్మానించి అభినందించారు. తిలక్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి సమ్మేళనాలు సమాజాన్ని ప్రభావితం చేసి మరింత మందిని తయారు చేయడానికి ఊతమందిస్తాయన్నారు. అంబేడ్కర్ సేవా కేంద్రం చైర్మన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాలతో పాటు శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున కవులు గాయకులు పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటివరకు 1,670 బౌద్ధ వివాహాలు జరిపించిన అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన గిడ్ల వీరప్రసాద్‌ను ఈ సమ్మేళనంలో ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు నయనాల కృష్ణారావు, జి.కూర్మయ్య, జీవీ వి సత్యనారాయణ, జి.స్వామిప్రసాద్, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.